సాక్షి
పల్నాడు
శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



యార్డుకు 1,15,799 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,11,337 బస్తాలు అమ్మకాలు జరిగాయి. ఇంకా 87,374 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు కార్యదర్శి తెలిపారు.



ఫార్మా పరిశ్రమల్లో మాక్ డ్రిల్

దాచేపల్లి: నడికుడి పారిశ్రామిక వాడలోని ఫార్మా పరిశ్రమల్లో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆపద్ మిత్ర బృందం పలు పరిశ్రమల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించింది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదని వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

టీడీపీ శవ రాజకీయాలు!

- టీడీపీలో ఆధిపత్యం కోసం జరిగిన హత్యపై రాద్ధాంతం
- రొంపిచర్ల టీడీపీ అధ్యక్షుడు బాలకోటిరెడ్డిని చంపింది అల్లుడు వరసయ్యే పమ్మి వెంకటేశ్వరరెడ్డి
- వాంగ్మూలంలో బాలకోటిరెడ్డి, ఆయన భార్య అదే చెప్పారు
- వెంకటేశ్వరరెడ్డి టీడీపీలో క్రియాశీలక నేత
- ఏ ఆధారం లేకపోయినా వైఎస్సార్ సీపీపై నెపం మోపుతున్న ప్రతిపక్ష పార్టీ
- విజయవాడ నుంచి చంద్రబాబు దూతల పేరిట వచ్చి శవరాజకీయం చేసిన వర్ల, బుద్దా, గద్దె



నరసరావుపేట ఎస్ఆర్‌కే జంక్షన్ వద్ద బుధవారం రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్ జామ్ చేసిన టీడీపీ నేతలు

సాక్షి, నరసరావుపేట: టీడీపీకి శవరాజకీయాలు చేయడం వెన్నతో పెట్టిన విద్య. ఎక్కడ హత్య జరిగినా వైఎస్సార్ సీపీపై నెపం నెట్టి ఆరోపణలు చేయడం అలవాటుగా మారింది. టీడీపీలో ఆధిపత్యం కోసం జరిగిన పోరాటంలో హత్య జరిగితే దాన్ని వైఎస్సార్ సీపీపై నెట్టి టీడీపీ నేతలు రాజకీయం చేస్తున్నారు. ఈ నెల 2న తుపాకీ కాల్పుల్లో రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి తీవ్రంగా గాయపడి 20 రోజుల చికిత్స అనంతరం మంగళవారం మరణించిన నేపథ్యంలో శవరాజకీయాలకు మరోసారి తెరలేపింది.

హత్యచేసింది అల్లుడే..

బాలకోటిరెడ్డికి అల్లుడు వరుసయ్యే పమ్మి వెంకటేశ్వరరెడ్డి టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో జరిగే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. భవిష్యత్తులో పార్టీలో మంచి గుర్తింపు, పదవులు అప్పగిస్తానని చెప్పి గత పంచాయతీ ఎన్నికలు, గ్రామంలో జరిగే ప్రసన్నంజనేయస్వామి తిరునాళ్లకు నిందితుడు వెంకటేశ్వరరెడ్డితో డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయించారు హత్యకు గురైన బాలకోటిరెడ్డి. తదనంతరం నిందితుడిని పట్టించుకోకుండా పార్టీలో కూడా సరైన స్థానం ఇవ్వకుండా చేస్తుండటంతో బాలకోటిరెడ్డిపై వెంకటేశ్వరరెడ్డి కక్ష పెంచుకున్నాడు. బాలకోటిరెడ్డి బతికి ఉండగా తనకు పార్టీలో స్థానం ఉండదని, గుర్తింపు లభించదని భావించాడు. ఎలాగైనా బాలకోటిరెడ్డిని చంపాలనే ఉద్దేశంతో గత ఏడాది జూలై 19వ తేదీ నిందితుడు వెంకటేశ్వరరెడ్డి దాడిచేసి చంపే ప్రయత్నం చేశాడు. తీవ్ర గాయాలతో బాలకోటిరెడ్డి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఆ విషయమై రొంపిచెర్ల పోలీసులు వెంకటేశ్వరరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి జైలుకి పంపారు. జైలులో రౌడీషీటర్ అంజిరెడ్డితో వెంకటేశ్వరరెడ్డి పరిచయం పెంచుకున్నాడు. అతనికి జరిగిన విషయాలు చెప్పి తనకు సహాయం చేయమని కోరినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత ఒక పథకం ప్రకారం పమ్మి వెంకటేశ్వరరెడ్డి అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు అనే వ్యక్తులతో బాలకోటిరెడ్డి ఇంటికి వెళ్లి అతడిని బయటకు పిలిచి తమ వెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్పులు జరిపారు. బుల్లెట్ నడుం కింది భాగంలోకి దూసుకెళ్లటంతో బాలకోటిరెడ్డి తీవ్ర గాయంతో పడిపోయాడు. బాలకోటిరెడ్డి పోలీసులకు వాంగ్మూలం ఇస్తూ తనపై హత్యాయత్నం చేసింది టీడీపీ నేత పమ్మి వెంకటేశ్వరరెడ్డి, మరో ముగ్గురు కిరాయి ముఠా అని తెలిపారు. హతుడి భార్య సైతం తన భర్తను చంపింది టీడీపీ నేత వెంకటేశ్వరరెడ్డి అంటూ పలు టీవీ చానళ్లలో సైతం మాట్లాడింది.



నరసరావుపేట టీడీపీ ఇన్‌చార్జి అరవింద్‌బాబుతో వెంకటేశ్వరరెడ్డి, హతుడు బాలకోటిరెడ్డి (ఫైల్)

పట్టించుకోని అరవింద్ బాబు..

ఏడాదికిపైగా బాలకోటిరెడ్డి, పమ్మి వెంకటేశ్వరరెడ్డి మధ్య ఆధిపత్య గొడవలు జరుగుతున్నా ఆ పార్టీ నరసరావుపేట ఇన్‌చార్జి చదలవాడ అరవింద్‌బాబు పట్టించుకోలేదు. వెంకటేశ్వరరెడ్డి అరవింద్‌బాబుకు ప్రధాన అనుచరుడిగా ఉంటున్నాడు. గత ఏడాది జూలై 19న హత్యాయత్నం చేసిన తర్వాతైనా ఆ పార్టీ పెద్దలు ఇద్దర్ని కూర్చోబెట్టి సర్దుబాటుచేయాల్సింది. వారి నిర్లక్ష్యంతో హత్య జరిగిన తర్వాత ఎప్పటిలాగే నెపం వైఎస్సార్ సీపీపై నెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు. ఒక్క చిన్న ఆధారం కూడా చూపకుండా అసత్య ఆరోపణలు చేస్తున్నారు. మాపార్టీకి సంబంధం ఉన్నట్లు ఏదైనా ఆధారం చూపాలని స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన సవాలుకు బదులిచ్చే సాహసం టీడీపీ నేతలు చేయడం లేదు. బాబు దూతలమంటూ వచ్చిన వర్ల రామయ్య, బుద్దా వెంకన్న, గద్దె రామ్మోహన్‌కు అసలు విషయం తెలిసినా, స్క్రిప్ట్ ప్రకారం నాటకం రక్తి కట్టించి వెళ్లారు. బాలకోటిరెడ్డి శవాన్ని స్వగ్రామం అలవాలకు కాకుండా నరసరావుపేటలో ర్యాలీ చేయాలని ఆ పార్టీ నేతలు ప్రయతి్నంచారు. పోలీసులు అడ్డుచెప్పడంతో ఎస్ఆర్‌కే జంక్షన్ వద్ద రోడ్డుపై బైఠాయించి వాహనదారులకు ఇబ్బందులు కలిగించారు. టీడీపీ శవరాజకీయాలు చూసి ప్రజలు అసహ్యించుకోవడం గమనార్హం.



గుంటూరురోడ్డులో పార్టీ కార్యాలయం ఎదుట ఈనాడు పత్రికలను దహనం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు

బాబు కోసం ఈనాడు విషపు రాతలు

- ఈనాడు ప్రతులను దహనం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు
- ఇలాంటి పత్రికలు రాష్ట్రంలో ఉండరాదన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: చంద్రబాబును మళ్లీ అధికారంలోకి తీసుకురావాలనే ఆలోచనతో 90 ఏళ్ల రామోజీరావు తన ఈనాడు దినపత్రికలో నీతి, నిజాయితీతో పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విషపురాతలు రాయిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. పార్టీ పిలుపు మేరకు గురువారం సాయంత్రం గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం ఎదుట ఈనాడు దిన పత్రిక ప్రతులను నాయకులు, కార్యకర్తలతో కలిసి దహనం చేశారు. పాత ఫొటోలు జోడించి తప్పుడు కథనం వండివార్చిన ఇలాంటి పత్రికలు రాష్ట్రంలో ఉండరాదన్నారు. చంద్రబాబు, రామోజీరావు, డాక్టర్ అరవిందబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉండగా ప్రజావ్యతిరేక పనులు చేయడంతోనే రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడిని తిరస్కరించారన్న విషయాన్ని రామోజీరావు గుర్తించాలని చెప్పారు. పట్టాభికి దెబ్బలు తగిలాయంటూ పాత ఫొటోలతో వార్త రాసి ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమానికి రామోజీ ఒడిగట్టి పత్రికలకు ఉన్న ప్రాధాన్యతను చంపేశాడన్నారు. ప్రజా సమస్యలు ప్రభుత్వానికి తెలియజేయాల్సిన పత్రికను చంద్రబాబును మళ్లీ సీఎం చేయాలనే తపనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రోజుకొక కట్టుకథను అల్లి ప్రచారం చేస్తున్నాడన్నారు. వివేకానందరెడ్డి హత్య తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా జరిగిన సంఘటనని, అప్పుడేమి వార్తలు రాయకుండా ఇప్పుడు సీబీఐ చెప్పినట్లుగా సీఎం జగన్‌పై రోజుకొక కట్టుకథను ప్రజల్లోకి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 15వ తేదీ జీతాలు ఇస్తుండగా ఒక్క వార్త రాసేందుకు ధైర్యం చేయని రామోజీరావు, ఏపీలో మాత్రం జీతాలు ఆలస్యమంటూ రాస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబును మోస్తూ లోకేష్‌ను జాకీలతో లేపేందుకు విపరీతంగా ప్రయత్నిస్తున్నా లేవట్లేదన్నారు. ఇక్కడ ఒక టీడీపీ నాయకుడి హత్య జరిగి, అది చేసింది టీడీపీ నాయకులేనని, మరణవాంగ్మూలంలో చెప్పినా, ఈ విషయంలో తాము చాలెంజ్ విసిరినా వైఎస్సార్‌సీపీ నాయకులే చేశారంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతాపాల్, మాజీ కౌన్సిలర్లు నెలటూరి మురళి, మాడిశెట్టి మోహనరావు, షేక్ మస్తాన్‌వలి, ఎస్సీ సెల్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు మల్లెల అశోక్,, అచ్చిశివకోటి, నాయకులు తలారి నాని, మారూరి శివారెడ్డి, సయ్యద్ ఖాదర్‌బాషా, బత్తుల విష్ణు పాల్గొన్నారు.

కూర్చోబెట్టి జీతాలు!

- గుంటూరు జీజీహెచ్ కార్యాలయంలో విచిత్ర పరిస్థితి
- కొందరు ఉద్యోగులు ఫైల్స్ పెట్టరు.. సీట్లో ఉండరు
- కొంత మంది ఏ పని చేయకుండానే జీతాలు డ్రా చేస్తున్న వైనం
- ఏళ్ల తరబడి పేరుకుపోతున్న కార్యాలయ ఫైల్స్
- చోద్యం చూస్తున్న ఆస్పత్రి అధికారులు
- పలువురు కార్యాలయ ఉద్యోగుల తీరుపై తీవ్ర విమర్శలు



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి

గుంటూరు మెడికల్: ఆస్పత్రికి ఆదాయం వచ్చే సైకిల్ స్టాండ్ టెండర్ ప్రక్రియను మూడేళ్లుగా నిర్వహించకుండా కార్యాలయ ఉద్యోగులు చోద్యం చూస్తున్నారు. డైట్ టెండర్స్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. పలువురు గుంటూరు జీజీహెచ్ కార్యాలయ ఉద్యోగులు ఆసుపత్రికి వచ్చి హాజరు వేసి ఏ పని చేయకుండా ఖాళీగా కూర్చుంటున్నా, ఒక్క నోట్ ఫైల్ కూడా సిద్ధం చేసి అధికారులకు పంపించకపోయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మరికొంత మంది ఉద్యోగులకు ఎలాంటి విధి నిర్వహణ బాధ్యతలు (సీట్లు) కేటాయించకపోవడంతో వారు ఏ విధులు నిర్వహించకుండానే ఆసుపత్రిలో కాసేపు గడిపి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మళ్లీ సాయంత్రం తాపీగా వచ్చి హాజరు వేస్తున్నారు. పనివేళల్లో కార్యాలయ ఉద్యోగులు సీట్లలో లేకున్నా, వారు ఎలాంటి ఫైల్స్ సిద్ధం చేయకుండా ఖాళీగా కూర్చున్నా వారిని అజమాయిషీ చేసే వారు లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆసుపత్రి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- ఆసుపత్రిలో కోవిడ్ సమయంలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సుగా పనిచేసిన ఎస్.కరుణకు వేతనం చెల్లించకుండా కార్యాలయంలోని ఓ ఉద్యోగి ఆమె జీతాన్ని వేరే వారి ఖాతాలో జమ చేశారు. ఈ విషయంపై పలుమార్లు బాధితురాలు ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జనవరి 9న ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేసింది. తప్పిదానికి పాల్పడి ఉద్యోగికి జీతం చెల్లించకుండా ఆసుపత్రికి సంబంధం లేని, వేరే జిల్లాకు చెందిన వ్యక్తికి వేతనం వేసిన ఉద్యోగిపై నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాల్లో పలువురు అనర్హులకు ఉద్యోగాలు కేటాయించడంతో పలువురు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో నియామకపు ఉత్తర్వులు ఇచ్చిన అభ్యర్థులను వెనక్కు పిలిపించి అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారు. అయితే ఈ తప్పిదాలకు పాల్పడిన ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు
- మెడికల్ లీవ్‌లు మంజూరు చేయకపోవడం, అరియర్స్ చెల్లించకపోవడం, సర్వీస్ సంబంధిత విషయాలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు లిఖిత పూర్వకంగా ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఒకేచోట ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు

జీజీహెచ్ కుటుంబ నియంత్రణ విభాగంలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్‌లు, ఒక జూనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. ఇరువురు రెగ్యులర్ సీనియర్ అసిస్టెంట్లు కాగా, ఒకరు అనధికార డెప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వాస్తవానికి కార్యాలయంలో ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్ పనిచేస్తే సరిపోతుంది. మిగతా వారంతా కేవలం కాలక్షేపానికే సంబంధిత విభాగంలో కూర్చుండిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎంఆర్డీలో కూర్చుండిపోయారు

జనన మరణాల నమోదుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే మెడికల్ రికార్డ్ డిపార్టుమెంట్‌లో కార్యాలయ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఖాళీగా కూర్చుండిపోతున్నారు. మెడికల్ రికార్డ్ టెక్నీషియన్ కోర్సు చదివిన అభ్యర్థులను ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్టు పద్ధతిలో నియమించింది. వీరు కాకుండా గతంలో శిక్షణ పొందిన జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. మెడికల్ రికార్డ్ ఆఫీసర్, ఓ మెడికల్ ఆఫీసర్, శిక్షణ పొందిన ఇద్దరు విభాగంలో విధులు నిర్వహిస్తే సరిపోతుంది. కానీ అధిక సంఖ్యలో సిబ్బందిని ఎమ్మార్డీ విభాగంలో పోస్టింగ్స్ ఇవ్వడం వల్ల పలువురు ఉద్యోగులు ఏపని చేయకుండా ఖాళీగా కూర్చుండిపోతున్నారు.

టెండర్ల ఫైల్స్ అనుమతి కోసం పంపాం

జీజీహెచ్‌లో టెండర్ల ఫైల్స్ అనుమతి కోసం ఉన్నతాధికారుల వద్దకు పంపించాం. అనుమతి రాగానే టెండర్ల నోటిఫికేషన్ ఇస్తాం. కార్యాలయ ఉద్యోగుల పనితీరుపై దృష్టి సారించి ఫైల్స్ పెండింగ్‌లో లేకుండా చూస్తాం.

– డాక్టర్ నీలం ప్రభావతి, సూపరింటెండెంట్, జీజీహెచ్, గుంటూరు

అన్ని విభాగాల్లో ఇదే తీరు

ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం, మేనేజర్ విభాగం, అకౌంట్స్ విభాగం, క్యాషియర్ విభాగం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ విభాగం, డైట్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల్లో కేవలం ఒకరిద్దరు మాత్రమే యాక్టివ్‌గా ఫైల్స్ సిద్ధం చేస్తున్నారు. మిగతా సిబ్బందంతా తమకు కీలకమైన ఫైల్స్, సీట్లు ఏమీ అప్పగించలేదంటూ ఖాళీగా మిన్నకుండిపోతున్నారు. మరో పక్క కలెక్టర్ గ్రీవెన్స్‌లో జీజీహెచ్ కార్యాలయంలో ఫైల్స్ పెండింగ్‌లో ఉంటున్నాయని, ముఖ్యంగా ఆసుపత్రికి ఆదాయం తీసుకొచ్చే టెండర్ల ఫైల్స్ కూడా చేయకుండా మిన్నకుండిపోతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆసుపత్రిలో 12 మంది సీనియర్ అసిస్టెంట్‌లు, 35 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్లు, క్లర్క్ కమ్ టైపిస్టులు ఉండి కూడా కార్యాలయ ఫైల్స్ పేరుకుపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆసుపత్రి అధికారులు స్పందించి కార్యాలయ ఉద్యోగుల పనితీరుపై పర్యవేక్షణ చేసి కార్యాలయంలో ఫైల్స్ పెండింగ్ లేకుడా చూడాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

తెనాలి నుంచి రైతు భరోసా

- 27న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఖాతాల్లోకి నగదు జమ
- ఇటీవల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా బదిలీ
- హెలిప్యాడ్, బహిరంగ సభా వేదిక పరిశీలించిన నేతలు



ఏర్పాట్లపై మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయాన్ని ఈ నెల 27వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అదే వేదికపై నుంచి ఇటీవల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నగదును కూడా రైతుల ఖాతాలకు బదిలీ చేయనున్నారు. ఇందులో భాగంగా బహిరంగ సభావేదిక, హెలిప్యాడ్ ఏర్పాట్లను గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ పరిశీలించారు. బహిరంగ సభా వేదికగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును ఎంపిక చేశారు. తెనాలి–నారాకోడూరు రోడ్డులో కవిరాజనగర్ లేఅవుట్‌లోని ప్రదేశాన్ని సందర్శించి హెలిప్యాడ్ ఏర్పాటుకు నిర్ణయించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెనాలి ఏరియాలో వైఎస్సార్ రైతు భరోసా/ పీఎం కిసాన్ లబ్ధిదారులు అధికంగా ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా నగదు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి తెనాలి నుంచి చేపడుతున్నారని కలెక్టర్ వెల్లడించారు. సీఎం సభకు వచ్చే రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి తెనాలిలో అడుగుపెడుతున్న సందర్భంగా అపూర్వంగా స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మెప్మా పీడీ వెంకటనారాయణ, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.నిర్మల, ట్రాన్స్‌కో ఎస్ఈ ఆవుల మురళీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లిని చెత్తకుప్పలో వదిలేసిన కొడుకు

- పారిశుద్ధ్య కార్మికుల సమాచారంతో రంగంలోకి రెవెన్యూ సిబ్బంది
- వృద్ధురాలిని మేరీ హోమ్స్‌కు తరలింపు



డంపింగ్ యార్డ్ వద్ద వృద్ధురాలు

తాడేపల్లిరూరల్: పేగుబంధాన్ని మరచి ఓ కొడుకు కన్నతల్లిని అర్ధరాత్రి వేళ డంపింగ్ యార్డ్ మధ్యలో వదిలేసి వెళ్లిన సంఘటన గురువారం సాయంత్రం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ బంధాలు, అనుబంధాలు మృగ్యమవుతున్నాయని చెప్పేందుకు ఈ సంఘటన వాస్తవ దర్పణం. గురువారం తెల్లవారుజాము నుంచి ఓ వృద్ధురాలు చెత్తా చెదారం మధ్య ఉండటాన్ని పారిశుద్ధ్య కార్మికులు, చెత్త ఏరుకునే వారు గమనించి బ్రహ్మనందపురం సచివాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు వీఆర్వో విన్నయ్య సంఘటన స్థలానికి వెళ్లి వృద్ధురాలిని ఇక్కడున్నావేంటని ప్రశ్నించగా ఆమె కళ్ల వెంబడి కన్నీరు ధారలయ్యాయి తప్ప ఎటువంటి సమాధానం రాలేదు. దీంతో ఆ వృద్ధురాలని వీఆర్వో విన్నయ్య సచివాలయానికి తీసుకువచ్చి అల్పాహారం అందించారు. అనంతరం ఆమెను ఆప్యాయంగా పలుకరించగా ఇది నా ఖర్మ అంటూ తలబాదుకుంది. నీకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. నిన్ను చక్కగా చూసుకుంటాం నీ పేరు ఏమిటని ప్రశ్నించగా తన పేరు ఎం.రామలక్ష్మి అని తెలిపింది. వారు అరగంట సేపు ఆమెతో మాట్లాడగా విజయవాడలోని గవర్నరుపేటలో తన నివాసమని, నా భర్త పేరు కృష్ణ అని, నా కొడుకు పేరు శ్రీనివాసరావు అని వివరించింది. బుధవారం రాత్రి 10 గంటలకు నన్ను ఇక్కడ వదిలేసి వెళ్లారని, చనిపోదామనుకున్నా ధైర్యం చాలలేదని ఆ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటికి తీసుకెళతామని చెప్పగా, చనిపోవడానికైనా సిద్ధంకాని అక్కడకు వెళ్లనని కన్నీటిపర్యంతమవ్వడం చూపరులను కలచివేసింది. తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి ఆదేశాల మేరకు డోలాస్ నగర్‌లోని మేరీ హోమ్స్‌లో వృద్ధురాలిని చేర్పించారు. ఈ సంఘటనపై పోలీసుల సహాయంతో విచారణ చేపట్టారు.

న్యూస్‌రీల్

రీసర్వే ఫిర్యాదులను పరిష్కరించండి

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో రీ–సర్వే జరుగుతున్న మండలాల్లో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంపై గురువారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ రికార్డ్స్, ల్యాండ్ సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ప్రధానంగా రీ–సర్వేలో డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డ్స్, సర్వే స్టోన్ ప్లాంటేషన్, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల గుర్తింపు, భూహక్కు పత్రాల పంపిణీ అంశాలకు సంబంధించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వెనుకబడిన మండలాలను ప్రస్తావించి వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్వేయర్లకు అవసరమైన 12 రకాల వస్తువులతో కూడిన కిట్స్‌ను ఉపయోగించుకొని సర్వే పనులను త్వరితంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు 75 శాతం దూసర పనులు పూర్తి చేశారని, మిగతా 25 పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అమరేశ్వరుడికి రూ.41.03 లక్షల ఆదాయం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసిఉన్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ హుండీల లెక్కింపును దేవదాయశాఖ ఉత్సవ అధికారి సమక్షంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది శివరాత్రికి మొత్తం రూ.41,03,542 ఆదాయం లభించిందని వివరించారు. హుండీల ద్వారా రూ.26,48,425 వచ్చినట్లు తెలిపారు. పూజా టికెట్లు, శివరాత్రి ప్రత్యేక అభిషేక పథకం, లడ్డూ ప్రసాదం తదితరాల ద్వారా రూ.14,55,117 అందినట్లు చెప్పారు. గత సంవత్సరం శివరాత్రికి రూ.32.54 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో చీరాలకు చెందిన భ్రమరాంబ సేవా సమితి, గుంటూరుకు చెందిన దుర్గామల్లేశ్వర సేవా సమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత రవాణ, వసతి సదుపాయాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీల్లో విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం రవాణా, వసతి సదుపాయాలను కల్పిస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. జిల్లా నుంచి పాల్గొననున్న విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లను తీసుకెళ్లేందుకు ఈనెల 27న ఉదయం 4 గంటల నుంచి విజయవాడ ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో రవాణా సౌకర్యం కల్పించే ఏర్పాట్లు చేశారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారులు పూర్తి బాధ్యత తీసుకుని రవాణా, వసతి సదుపాయాలను కల్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 9866528299 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సూర్యకిరణాల వెలుగులో జలపాలేశ్వరుడు



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని 16వ శతాబ్దం నాటి ఆలయంలోని జలపాలేశ్వరస్వామిపై సూర్యకిరణాలు పడుతుండటం విశేషం. 1675లో చోళరాజులు తమ రాజ్యంలోని ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకువచ్చి తాగునీటి కోసం ఓ బావిని తవ్వించారు. బావిలో నీరు పడటంతో ఇక్కడ జలపాలేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. కాగా ప్రతి ఏటా శివరాత్రి మరుసటి రోజు నుంచి తొమ్మిది రోజుల పాటు గర్భగుడిలో ఉన్న స్వామివారిపై సూర్య కిరణాలు పడి కొద్దిసేపు ఉంటాయని ఆలయ అర్చకులు ఉమాపతిశాస్త్రి తెలిపారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుంటున్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 552.40 అడుగుల వద్ద ఉంది. ఇది 215.0970 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,350, ఎడమకాలువకు 9,076, ఎస్ఎల్‌బీసీకి 1,650, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

డ్రామాలతో ఎన్నాళ్లు దుష్ప్రచారం చేస్తారు

ప్రభుత్వ విప్ పీఆర్కే



మాచర్ల: ఉమ్మడి కృష్ణా జిల్లా గన్నవరంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభి విజయవాడ నుంచి సంఘవిద్రోహులను తీసుకెళ్లి నానా హడావుడి సృష్టించి పోలీసులపై దాడి చేస్తే దానిపై ఈనాడు పత్రికలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై దుర్మార్గంగా కథనాలు రాయటం దారుణమని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు ఎంతో మేలు చేస్తూ 18 ఎమ్మెల్సీ స్థానాలకు 11 బీసీలు, 2 ఎస్సీలు, ఒకటి ఎస్టీలకు కేటాయించిన విషయాన్ని పక్కదారి పట్టించటానికి టీడీపీ అధికార నేత పట్టాభి ద్వారా గన్నవరంలో గొడవలకు పాల్పడ్డారన్నారు. పోలీసులు అరెస్టు చేయగానే ఎల్లో మీడియా పట్టాభిని కొట్టారంటూ దుష్ప్రచారం చేసిందని అన్నారు. రెండేళ్ల కిందట జరిగిన సంఘటనకు సంబంధించిన ఫొటోలు కొత్త డ్రామాకు తెరతీశారని, వాస్తవాలు బయటకురావడంతో అభాసుపాలైన ఎల్లో మీడియా సవరణ వేసి తప్పుకోవాలని చూస్తోందని అన్నారు. ఏదో రకంగా వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేసేందుకు మొదటి ప్రాధాన్యమిస్తుందన్నారు. ఇటువంటి వాటిని తిప్పికొట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు పేద ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ లక్ష కోట్ల పైగా నిధులను నేరుగా కేటాయిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలన్నారు. పల్నాడు జిల్లాలోని ప్రతి గ్రామంలో టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని ఎండగట్టి అందరిని చైతన్యం చేయాలన్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా టీడీపీ, ఎల్లో మీడియా చర్యలను ప్రజలకు వివరించేందుకు త్వరలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పీఆర్కే తెలిపారు.

ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దాం

ఆర్టీసీ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు

మాచర్ల: ఉమ్మడి జిల్లాలో మాచర్ల ఆర్టీసీ డిపో ఆదాయంలో ఉన్నత స్థాయిలో ఉండటంతోపాటు ప్రయాణికులకు ఎన్నో సౌకర్యాలు కల్పించటం ఆనందకరమని ఆర్టీసీ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం మధ్యాహ్నం మాచర్ల ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లను సందర్శించి ప్రయాణికులతో పాటు ఉద్యోగులతో మాట్లాడారు. మెరుగైన సేవలను ప్రయాణికులకు అందిస్తున్న ఘనత మాచర్లకు దక్కుతుందన్నారు. అనేక నూతన బస్సు సర్వీసులను మాచర్ల నుంచి వివిధ ప్రాంతాలకు నడిపేందుకు త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఆర్టీసీ ప్రయాణికుడిని సురక్షితంగా గమ్యం చేర్చటానికి ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో లాగా అదనపు చార్జీలు వసూలు చేయకుండా ప్రతి పండుగకు కూడా ప్రత్యేక బస్సులు సాధారణ ఛార్జీలతో నడిపి ప్రయాణికుల మన్ననలు పొందుతున్న ఘనత ఆర్టీసిదేనన్నారు. ఆర్టీసీ ఆదాయం పెరిగిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకొని సంస్థ ఆదాయం పెంచటంతోపాటు సంస్థ అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈయన వెంట ఆర్టీసీ ఉన్నతాధికారులతోపాటు పలువురు పాల్గొన్నారు. ఆర్టీసీ గ్యారేజిలో ఆయన మొక్కలు నాటారు.

ప్రొటోకాల్ ఉల్లంఘించకండి!

● జెడ్పీ ఆస్తులను పరిరక్షించాలి ● ఆదాయ పెంపుదలకు సమష్టిగా కృషి చేయండి ● జెడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా



మాట్లాడుతున్న కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో మూడు జిల్లాల పరిధిలోని ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మండలాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని, ఇకపై ఎటువంటి ఉల్లంఘనలు జరిగినా సంబంధిత అధికారుల మీద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఆస్తులను పరిరక్షించడంలో ఎంపీడీవోలు కీలక పాత్ర పోషించాలని, స్థానిక జెడ్పీటీసీలతో కలిసి తరచుగా ఆస్తుల పరిరక్షణ కమిటీ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కొంత కాలంగా జెడ్పీకి, ఎంపీడీవోలకు మధ్య దూరం పెరిగిందని, ఇకపై అటువంటి పరిస్థితులు లేకుండా నిరంతరం సమీక్ష సమావేశాలను నిర్వహిస్తామన్నారు. సీఈవో జె.మోహన్‌రావు మాట్లాడుతూ జెడ్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, మండల పరిధిలోని అన్ని రిపోర్టులు స్వీకరణతో పాటు పరిపాలనా పరంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చాలా ఉపయోగపడుతుందన్నారు. జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ బత్తుల అనురాధ, అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

జెడ్పీ ఆస్తులను పరిరక్షించాలి

జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చాంబర్లో జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణకు సమావేశాన్ని నిర్వహించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ అచ్చంపేట మండలంలోని రేవులు అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆక్రమణలకు గురైన జెడ్పీ భూములను గుర్తించి తక్షణమే వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములుగా నమోదు అయిన జెడ్పీ ఆస్తులను తిరిగి జెడ్పీ ఆస్తులుగా వర్గీకరణ చేయాలని పేర్కొన్నారు. జెడ్పీ భూముల్లో హోర్డింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయ వనరులు పెంపొందించాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న జెడ్పీ గెస్ట్‌హౌస్‌లను బాగుచేయించి వినియోగంలోకి తేవడం ద్వారా ఆదాయ వనరులు పెంచాలని తెలిపారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసి న ఆస్తుల పరిరక్షణ కమిటీ ఎప్పటికప్పు డు జెడ్పీ ఆస్తులను పర్యవేక్షిస్తూ అన్యాక్రాంత కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బీసీలపై మమకారం మరోసారి రుజువైంది

–ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వంటి వెనుకబడిన వర్గాల వారికి రాజకీయ సామాజిక న్యాయం కల్పించిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లి ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ శాసనమండలిలో 18 స్థానాలు ఉంటే వాటిలో 11స్థానాలు బీసీ సామాజిక వర్గాల వారికి ప్రాధాన్యత కల్పించటం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలపై ఉన్న మమకారం మరోసారి రుజువు అయిందన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని దేశంలో పలువురు మేధావులు సైతం అభినందించారని అన్నారు. రాష్ట్రంలో ఇంత గొప్పగా పారదర్శకంగా పరిపాలన జరుగుతుంటే చూసి జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు చంద్రబాబు డైరెక్షన్‌లో రాష్ట్రంలో ఏదో అలజడి సృష్టించాలని, గన్నవరంలో పట్టాభి అనే టీడీపీ నాయకుడు అక్కడ ఉన్న నాయకత్వాన్ని రెచ్చగొడుతు గొడవ సృష్టిస్తే చట్టం తన పని తాను చేసుకుంటు పోయిందన్నారు. అటువంటి సంఘటనను టీడీపీ పచ్చ మీడియా మాత్రం ఉన్నదిలేనట్టు లేనిది ఉన్నట్టు కల్పించి పాత ఫోటోలు, క్లిప్పింగ్స్‌ను ముద్రించి వక్ర రాతలు రాసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండి పడ్డారు. రాష్ట్రంలో ప్రజా రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉన్నారని టీడీపీ నాయకులు ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు గమనిస్తున్నారని, మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా చూసుకోవటానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని మోపిదేవి అన్నారు. ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, జెడ్పీటీసీ మరివాడ పావని, మండల పార్టీ కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి, బాపట్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, డి. వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీల ఆటో బోల్తా

10 మందికి గాయాలు

చిలకలూరిపేట: వ్యవసాయ కూలీలతో కూడిన ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టిన ప్రమాదంలో 10 మంది గాయాలపాలైన సంఘటన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుగాలీకాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు నాదెండ్ల మండలం కనపర్రులోని పొలం పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్న క్రమంలో ఒకే ఆటోలో 18 మంది ఎక్కారు. ఆటో చిలకలూరిపేట మండలం కావూరు గ్రామం సమీపంలోకి చేరే సరికి కుక్క అడ్డురావటంతో తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న మోటార్‌బైక్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సాయితోపాటు, ఆటోలో ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలు కె భవానిబాయి, వి లక్ష్మీబాయి, కె కుమారిబాయి, కె భాగ్యం, అంజమ్మ, వెంకటరమణ, సోలిబాయి, సోనాబాయితో పాటు బైక్‌పై వస్తున్న మల్లికార్జునరావుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు 108 వాహనాల సిబ్బంది గాయపడిన వారిలో ఆరుగురిని నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి, నలుగురిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్యాన్సర్ రోగుల కోసం కారు బహూకరణ

గుంటూరు మెడికల్ : క్యాన్సర్ రోగుల కోసం జీజీహెచ్‌కి ఓ దాత కారునూ బహూకరించారు. క్యాన్సర్ తీవ్రత ఎక్కువగా ఉండి చికిత్స అవసరమై ఆసుపత్రికి రాలేని పరిస్థితులు ఉన్నవారి కోసం ఇంటి వద్దకే కారు పంపించి ఉచితంగా వారిని ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందించి తిరిగి ఇంటి దగ్గర వదిలి పెడతారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఈ అవకాశం అందుబాటులోకి వచ్చింది. గుంటూరు వైద్య కళాశాల బయో కెమిస్ట్రీ విశ్రాంత ఆచార్యులు, దివంగత మట్టా జోజిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె డాక్టర్ జ్యోతి కుటుంబ సభ్యులు గురువారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ కు టాటా ఎలక్ట్రికల్ కారును బహూకరించారు. చికిత్స కోసం ప్రతిసారి ఆసుపత్రికి రాలేని క్యాన్సర్ రోగులకు వారి ఇంటికే నర్సింగ్ సిబ్బంది, సోషల్ వర్కర్ వెళ్లి వైద్య సేవలు అందించడానికి ఉద్దేశించి ఈ కారును బహుకరించినట్లు దాత డాక్టర్ జ్యోతి వెల్లడించారు. తొలిసారిగా నాట్కో క్యాన్సర్ సెంటర్ ద్వారా గుంటూరు నగరానికి 25 కిలోమీటర్ల దూరంలో క్యాన్సర్ ఉన్న రోగులకు, ఇంటి వద్దనే వైద్య సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నాట్కో సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్ తెలిపారు. వాహన సేవలు అవసరమైన క్యాన్సర్ రోగులు వినియోగించుకోవాలన్నారు.

నాణ్యమైన ఆహార వస్తువులు అందివ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరువెస్ట్: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన పోషక వస్తువులు సక్రమంగా సరఫరా జరిగేలా సంబంధిత ఏజెన్సీలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ పోషణ కిట్‌లు, ఫోర్టిఫైడ్ రైస్, నూనె, కందిపప్పు, కోడిగుడ్లు, నిర్దేశించిన పరిమాణంలో నాణ్యంగా ఉండాలని, వీటిని సీడీపీవోలు పరిశీలించాలని తెలిపారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు పెడుతుందని, గర్భిణీలు, చిన్నారులు, ముఖ్యంగా రక్తహీనత ఉన్నవారికి సరైన పోషక విలువలు ఉన్న ఆహారం తప్పక అందించాలన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ మనోరంజని, జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మీ, డీఎస్ఓ పద్మశ్రీ పాల్గొన్నారు.